# ఫియస్టా–సియస్టా (పాజిటివ్ ఇన్ నెగెటివ్)

–బేతనపల్లి బోస్, Fairlawn, NJ

'తాయారూ, తాయారూ ఎక్కడున్నావు?'
'ఏం శ్రీవారూ? పిలిచారా? కొంపేం మునిగింది? ఏమిటా గావు కేకలు?'
'ఆఫీసు కు లేట్ అవుతుంది. కాస్త తొందరగా లేపమన్నానా, లేదా?'
'మీరేమో కుంభకర్ణుడికి తక్కువ వారా ఏమిటీ? గురకలు కొట్టి నిద్రపోతుంటే పోనీలే పాపం పది నిముషాలు పడుకోనీయ్ అని ఊరుకొన్నాను, తప్పా?'
'అబ్బా! లేట్ అయితే, రిమార్కు అది నీకు తెలియదా?'
'ఇంతకీ గురకల అలారమ్ మిమ్మల్ని నిద్ర లేపిందని అనుకొంటున్నారా? ఎలా లేచాననుకొన్నారు?'
'సరి సరి. ఎక్కడా నా బ్రష్? ఎక్కడా నా పేస్టు?'
'బెడ్‌రూమ్ లో ఎందుకుంటుంది?'
'..............'
'ఆలస్యం అనుకొంటూ ఎంత సేపు స్నానం చేస్తారు? సంగీత సాధన ఇప్పుడే చెయ్యాలా? మనసుకి ఇష్టం అయ్యింది చేస్తున్నప్పుడు అబ్బాయ్‌గార్కి ఆఫీసుకి లేటు అవుతున్నట్లు తెలీదా?'
'ఆ! ఇంతకీ నా బట్టలేవి? ఏమిటి హాఫ్ హేండ్స్ షర్టు తీసి పెట్టావు?'
'అయితే రోజూ పడుకొనే ముందు టి.వి. వాచ్ చేస్తుంటారు? వెదర్ రిపోర్టు వినరా?'
'...... అయితే తాయారు ఏమిటి టిఫెన్?'
'మీకు ఇష్టం లేని టిఫెన్ ఎప్పుడైనా చేశానా?'
'...........'
'ఆఫీసు పని అంటే హైరానా, ఇంట్లో పనంటే నీరసం వస్తుందని అంటున్నారా లేదా? ఏమిటా తినడం?'
'............'
సరే తొందరగా వచ్చేస్తారు గదూ ఇంటికి?
'వర్కునుండి ఇంటికి రాక మధ్యలో ఎప్పుడైనా ఎక్కడైనా స్టాపు పెట్టానా? వెళ్ళే ముందు నా బయానా ఏది?
బయటికి వెళ్ళినప్పుడు బయానా, పని చెబితే పగిడి. మామూలుగా వెళ్ళి రాలేరా?'
'ఈ దేశంలో ఉద్యోగస్తులకు లంచాలు రావని నీకు తెలియదా? ఇదేం ఇండియా అనుకొన్నావా? నిన్ను గాక ఎవరిని అడగాలి? తప్పుగా అడిగానా?'

* * * * *

'అయ్యగార్కి పని నుండి వచ్చేదానికి ఇంత లేట్ అయ్యిందే? ఇంటి దగ్గర తమకోసం ఒక మనిషి ఎదురు చూస్తూ వుంటుందన్న జ్ఞానం వుండదా? అయితే ఆఫీసు ఎలా వుంది?'
'ఆ! ఆఫీసు పనీ మామూలే, నా లేటూ మామూలే. వింటర్ టైమ్‌లో స్నో, స్ప్రింగ్ టైమ్‌లో ఫ్లడ్డింగు, సమ్మర్ నుండి ఫాల్ చివరి వరకు రోడ్ల రిపేర్లు. మధ్య మధ్యలో కారు ఏక్సిడెంట్లు, డిజేబుల్డ్ కార్లు. మొత్తంమీద, సంవత్సరం పొడుగు నా ట్రాఫిక్ డేకుతూనే వుంటుంది. లేటు అవుతూనే వుంటుంది. నీకు తెలియదా? తినేదానికి ఏమైనా ఇచ్చేది వుందా? ప్రశ్నలేనా?'
'............'
'మెయిల్ ఏమన్నా వుందా? ఏమిటి న్యూస్?'
'మెయిల్ వుంటే ఇవ్వనా? న్యూస్ వుంటే చెప్పనా?'
'బయటికి వెళ్ళాల్సిన పని ఏమన్నా వుందా?'
'ఉంటే గింటే ఉదయమే చెప్పేదాన్ని కదా?'

* * * * *

'అబ్బాయ్‌గారు భోజనానికి వచ్చేది ఏమన్నా వుందా? టి.వి.కి అతుక్కుపోవడమేనా?'
'పిలిపించుకొని వెళ్ళే బావుంటుందా? పిలవకుండా వెళ్ళే బావుంటుందా?'
'సరేగాని, ఎలా వుంది వంటకం? మాట్లాడితే నోటి ముత్యాలు రాలి పోతాయా?'
'తాయారూ, నేనింత ఆరోగ్యంగా వున్నానంటే ఎవరు కారణం అనుకొంటున్నావు?'
'తిన్నగా మాట్లాడడం రాదా?'
'సర్లేగాని రోజంతటకీ రెండే పనులు నచ్చుతాయి నాకు. ఒకటి ఫియస్టా, రెండోది సియస్టా. అంటే ఏమిటి నీకు తెల్సా?'
'ఆహా! మీరు ఇటాలియన్ భాషలో చెప్పినా, ఇతర భాషలో చెప్పినా కంచం, మంచం అనే అర్థాలు కాదంటారా?'
'ఆరి నీ.....'
'ఆశ్చర్యపోకండి. మీ గురించి మీ కంటే నాకే బాగా తెల్సు కాదనగలరా?'
'ఫియస్టా అయ్యింది. సియస్టా కోసం రూమ్‌కి వెళ్తామా? భోజనం తరువాత కాస్త వేదాం పారాయణం చెయ్యాలి గదా! వేదాంతం అనే పెద్ద మాట ఎందుకులెండి? పారాయణం అంటే పోలేదూ? జీవాత్మపరమాత్మలో ఐక్యం అయినప్పుడే ముక్తి, మోక్షం అన్నారు. అలాగే ఫ్రూట్స్, కేక్ పట్టుకొని వస్తావుగదా?'
'రోజూ ఈ చదువు వుండాల్సిందేనా?
నీకు తెల్సుకదా నాకు నిద్ర పట్టదని. మళ్ళీ మళ్ళీ చెప్పాలా?
'ముద్దు అంత గొప్పదా? పెదవికి అది తప్పదా?'
అనే పాట సన్నగా విన్పిస్తుంది కేసెట్ ప్లేయర్ నుండి.
భార్యాభర్తలు ఇంకా ఏమి మాట్లాడుకొంటారో వినాలని వుందా?
ఇంకా దేనికోసం ఎదురు చూస్తున్నారు నిష్క్రమించకుండా?



వ్రాస్తే అదే వస్తుంది వ్రాయు అంటారండి సీనియర్స్
తీరా వ్రాస్తే కలం పట్టిన ప్రతీవాడూ వ్రాయుటమే
అంటారండి క్రిటిక్స్
ఇదేం న్యాయం? చెప్పండి మీరే బ్రదర్స్...
– శశి